విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, ఆగస్టు 2025

సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా చెన్నరాయుడు

విశాలాంధ్ర-ఉరవకొండ: సీపీఐ పార్టీ అనంతపురం జిల్లా సమితి సభ్యులుగా చెన్నా రాయుడు ఎన్నికయ్యారు. అనంతపురంలో జరిగిన జిల్లా మహాసభలలో జిల్లా పార్టీ నాయకత్వం సమితి సభ్యులుగా ఎంపిక చేసింది. చెన్నా రాయుడు విడపనకల్లు మండల కార్యదర్శిగా, ఉరవకొండ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా, పనిచేయగా ప్రస్తుతం ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా చెన్నరాయుడు శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా సమితి సభ్యులుగా తనను ఎన్నుకున్న జిల్లా పార్టీ నాయకుల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో ఉరవకొండ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

తుంగభద్ర గేట్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం వీడాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: మూడు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే తుంగభద్ర డ్యాం కు సంబంధించి గేట్ల మరమ్మతుల చేపట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వీడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాల పర్యవేక్షణ లోపం కారణంగా గత ఏడాది టిబి డ్యాం గేట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కన్నయ్య నాయుడు లాంటి ఇంజనీర్ల సలహాతో సకాలంలో గేటు మరమ్మతులు చేశారని, ఈ ఏడాది మరో 8 గేట్లు దెబ్బతిన్నాయని పత్రికల్లో రావడం బాధాకరమన్నారు. తుంగభద్ర డ్యాం కి ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద ఎక్కువగా వస్తుందని, దీనిములంగా డ్యాం పూర్తి స్థాయిలో నిండిపోతుందన్నారు. అయితే 103 టీఎంసీలు నిల్వ చేయాల్సిన డ్యాం కేవలం 80 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని ఇంజనీర్లు చెప్తున్నారని.. 1953లో బిగించిన డ్యాం గేట్లు నేటికి మార్చకపోవడంతోనే నేటి దుస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నిధులు వెచ్చించి గేట్లు పూర్తి స్థాయిలో మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. సాధ్యం కాని బనకచర్ల ,పోలవరం అనుసంధానంపై దృష్టి పెట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు గేట్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు.

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు

- ఇళ్లు, దుకాణాల పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు
- రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా..

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆయా పరిధుల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. శనివారం జిల్లాలోని పలు సమస్యాత్మక గ్రామాలు, కాలనీలలో తెల్లవారుజామున నుండి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఫుట్ పెట్రోలింగ్, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి గంజాయి, అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, క్రైం అగనెస్ట్ ఉమెన్, శక్తి యాప్ , డయల్-100, సిసి కెమేరాల ప్రాముఖ్యత, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. గ్రామాలలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామాలలో ప్రజలకు సూచించారు. గంజాయి, కర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితుల, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలు, దుకాణాలు, బడ్డీ కొట్లలో క్షుణ్ణంగా తనిఖీలు కొనసాగించారు. అక్రమ మద్యం జోలికెళితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పాత కేసుల్లో నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. బెల్టు దుకాణాలు నిర్వహించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు.

బెలుగుప్ప ఎస్సైకు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-బెలుగుప్ప : మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శివ మండలంలోని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నందుకు ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనంతపురంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎస్పీ జగదీష్ బాబు ఆయనకు ఉత్తమ అవార్డును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల కోసం ఎంతో కృషి చేశాడని కొనియాడారు. ఎస్సై శివకు ఉత్తమ అవార్డు రావడంతో బెలుగుప్ప పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఎస్ఐ రామదాసు అభినందనలు తెలిపారు.

వెండి కిరీటాలు అందజేత

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బొమ్మనహల్ హెడ్ కానిస్టేబుల్ నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులు సీతారామ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాల అలంకరణ కోసం 3 వెండి కిరీటాలను అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు కిరీటాలను ఆలయంలో అందజేశారు.

కౌన్సిలర్ చొరవతో వర్షపు నీరు తొలగింపు..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని 30వ వార్డ్ భగత్ సింగ్ నగర్లో ఉన్న బాలికల వసతి గృహంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల బాలికల వసతిగృహం పూర్తిగా వర్షపు నీరుమయం అయ్యింది. దీంతో అవార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జునకు బాలికల వసతి గృహం వార్డెన్ సమస్యను తెలియజేయగా వెంటనే వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున జోక్యం చేసుకొని మున్సిపల్ వర్కర్స్‌ను పిలిపించి వర్షపు నీరుని తొలగించేశారు. దీంతో వసతి గృహ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డెన్ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్..

విశాలాంధ్ర-తాడిపత్రి : పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ శివగంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్లో సిఐ శివ గంగాధర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు సబ్ డివిజన్ ఇంఫోర్స్మెంట్ సభ్యులతో కలిసి రాబడిన సమాచారం మేరకు పెన్నానది కొత్త బ్రిడ్జి, చుక్కలూరు రోడ్డు వద్ద ఏడు మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి నగదు లక్ష 2వేల రూపాయలు, మూడు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన శేషాద్రి (19)ని చుక్కలూరు గ్రామం వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుండి 610 గ్రాముల గంజాయి, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ కాటమయ్య, కానిస్టేబుల్ ప్రసాద్, రవి పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆలయం వద్ద పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాల వద్ద ఆయా స్టేషన్లో పరిధిలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తోపులాటలు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయించి దర్శనాలు సాఫీగా జరిగేలా ఆయా దేవాలయాల అధికారులు, కమిటీల సభ్యులతో కలసి విధులు నిర్వహించారు. అనంతపురం ఇస్కాన్ దేవాలయంతో పాటు జిల్లాలోని ముఖ్య దేవాలయాల పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చోరీలు, ఈవ్ టీజింగ్‌లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఇస్కాన్ మందిరం వద్ద డ్రోన్‌తో నిఘా పెట్టారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి..

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

విశాలాంధ్ర-అనంతపురం : భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్నని జిల్లా రెవిన్యూ అధికారి ఏ.మాలోల పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా బి సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికార అధికారిణి ఖుష్బూ కొఠారి,బి సి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కలెక్టర్, సచిన్ సహార్, బి సి కార్పొరేషన్ డైరెక్టర్లు, బిసి సంఘాల నాయకుల తో కలసి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి జయంతి మహోత్సవం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్ఓ మాట్లాడుతూ... సమాజం కోసం ప్రతినిత్యం శ్రమించిన డాక్టర్ సర్దార్ లచ్చన్నను ఆదర్శంగా తీసుకొని నేటి నాయకులు సమాజ సేవ చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోనే మొదటిగా డాక్టర్ సర్దార్ గౌతు లక్షన్న జయంతి ఉత్సవాల నిర్వహించుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బీసీల అన్ని రకాలుగా అభివృద్ధి అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశం అన్నారు. మద్యం పాలసీలో సంస్కరణలు తీసుకొచ్చి మద్యం దుకాణాలకు సంబంధించి గీత కార్మికులకు మద్యం షాపుల లో 10 శాతం రిజర్వేషన్ కల్పించి, లైసెన్సులు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ, సహాయ బీసీ సంక్షేమ అధికారిణి సుభాషిణి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంతకల్లు : దేశానికి నిస్వార్థంగా సేవలు అందించిన గౌతు లచ్చన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలో ఆయన క్యాంప్ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్, యువనేత పవన్‌గౌడ్ హాజరైనారు. ముందుగా గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమ స్ఫూర్తి ప్రతీక, రైతు సంక్షేమం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో ఎన్నో ఉద్యమాలు నడిపిన మహోన్నత నేత సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. నియోజకవర్గం ఈడిగ, గౌడ కుల సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులతో కలిసి లచ్చన్న చిత్రపటానికి పుష్పంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అనిల్ గౌడ్, ఈ.ఓ రాముడు, వెంకటేశ్వర్లుగౌడ్, చలపతి, రవిశంకర్ గౌడ్, శ్రీరాములుగౌడ్, నారాయణస్వామి, ఆంజనేయులు గౌడ్, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏపీజీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కార మార్గా లను చూపడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ (ఏపీజీఏ) సంఘం ప్రధాన లక్ష్యమని అనంతపురం జిల్లా సంఘం అధ్యక్షుడు గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం జిల్లా సంఘం కార్యాలయంలో ఆ సంఘం 7 వ వార్షిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ మాట్లాడుతూ. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినప్పటికీ చాలా వరకు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని సుమారు రూ.35 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, పెన్షనర్ల పరిస్థితి మరింతగా దయనీయంగా మారిందన్నారు. సీపీఎస్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు ఇంతవరకు పరిష్కారం కాలేదని ప్రభుత్వం న్యాయపరంగా సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఉద్యోగ వర్గాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి వస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాము నాయక్, మహిళ నాయకురాలు సాంబశివమ్మ, సుజాత, సిటీ యూనిట్ అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, ట్రెజరర్ మౌలాసాబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, ఈశ్వరయ్య సింగనమల తాలూకా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతున్నలు

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ మండలంలో యూరియా కోసం ఉదయం నుండి బారులు తీరినా రైతులకు దక్కుతున్నది రెండు సంచులే మాత్రమే. మిగతా వారికి ఖాళీ చేతులే. ఒక రైతు రెండు జిరాక్స్ తీసుకొని వెళ్లి తంబు వేసిన యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. తుంగభద్ర జలాలు వచ్చాయన్న ఆనందంలో రైతులు మాగానిలో నాటు వేసుకుని కూర్చున్న సమయంలో యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. రైతులు మాట్లాడుతూ యూరియా వచ్చిన వెంటనే బడాబాబుల చేతిలోకి వెళ్లిపోతున్నాయని.. ఎవరూ అడిగే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సన్నకారు రైతులు. రెండు లారీలు యూరియా వచ్చిన కొన్ని గంటలలోనే అయిపోగా మిగతా రైతులంతా నిట్టూర్పుతో వెనుతిరిగారు. యూరియా ఎప్పుడో వస్తుందంటే చెప్పలేమని అధికారులు దాటవేస్తున్నారు. రైతులు మాత్రం దిగులతో వరి పంట కోసం ఎదురుచూస్తూ అప్పులు చేసుకొని వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు.

ఐకాన్ అవార్డుకు కానిస్టేబుల్ విష్ణు ఎంపిక ..



విశాలాంధ్ర-యాడికి: పురాతన నాణెముల సేకరణ లో విశేషమైన ప్రతిభను కనబరిచిన కానిస్టేబుల్ విష్ణు భగవాన్ సుభాష్ చంద్రబోస్ ఐకాన్ అవార్డుకు ఎంపిక అయ్యారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ చారిత్రక నాణెములను సేకరించి వాటిని విజ్ఞానం నిమిత్తం వివిధ ప్రాంతాలలో ఉచిత ప్రదర్శనలు నిర్వహించి నందుకు గాను ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌కు చెందిన జీవన్ జాగృతి ఆర్గనైజేషన్ వారు పుర ప్రజలు విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞానం నిమిత్తం వివిధ పాఠశాలలో కళశాలలో నాణాల ప్రదర్శనలు నిర్వహించి అందరినీ చైతన్య పరిచినందుకు గాను స్వాతంత్ర్య దినోత్సం రోజున సుభాష్ చంద్రబోస్ ఐకాన్ అవార్డు 2025కు ఎంపిక చేయడం జరిగిందని కృష్ణ భగవాన్ తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో మొదటి సారిగా అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన నాప కృష్ణమూర్తి (35) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. దురదకుంట గ్రామానికి చెందిన నాప నాగరాజు , అక్కమ్మల కుమారుడు కృష్ణమూర్తి బెంగుళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కృష్ణమూర్తి భార్య సుస్మిత తన పుట్టింటిలోని కూచివారిపల్లెలో ఉండగా ఆమె దగ్గరికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. బెంగళూరు నుండి శుక్రవారం ఉదయం బయలుదేరిన కృష్ణమూర్తి పెనుగొండ కియా ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురయ్యాడు. తాను నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని మరో వాహనం ఢీకొనడంతో కృష్ణమూర్తి తలకి బలమైన గాయాలయ్యాయి. సుమారు గంట పాటు కృష్ణమూర్తి రోడ్డుపైనే పడిపోయాడు. అటుగా వెళ్లేవారు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పెనుగొండ కియా పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఢీకొట్టిన వాహనం కోసం గాలిస్తున్నారు. కృష్ణమూర్తి స్వగ్రామం దురదకుంటలో అంత్యక్రియలు నిర్వహించారు.

శ్రావణి ఆత్మహత్య కేసులో భర్త, అత్తమామల అరెస్టు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: అత్తారింటి వేధింపులు తాళలేక పోలీసులచే సరైన న్యాయం జరగలేదని వాయిస్ మెసేజ్ రికార్డు చేసి ఆత్మహత్యకు పాల్పడిన శ్రావణి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ జగదీష్ ఈ కేసు పై ప్రత్యేక విచారణ చేపట్టాలని గుంతకల్ డిఎస్పి శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేయడంతో 24 గంటల్లో శ్రావణి ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టారు. అదనపు కట్నం కోసం వేధించిన భర్త శ్రీనివాసులు, అత్తమామలు శివప్ప,వి కరియమ్మలను అరెస్టు చేశారు. వీరిపై క్రైమ్ నంబర్ 147/2025, యు/ఎస్, 85, 80 రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్‌లు నమోదు చేసినట్లు ఇంచార్జ్ డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం పట్టణ సిఐ యువరాజ్ ఎస్సైలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-ఉరవకొండ: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉరవకొండ- బళ్లారి బైపాస్ రోడ్డులో వెలిసిన గోపాలకృష్ణ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవానుని దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయం హోరెత్తింది గవి మఠం ఉత్తరాధికారి కర్రీ బసవ రాజేంద్ర స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్ని విషయాల్లో మనకు స్ఫూర్తినిచ్చే శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గణేష్‌బాబు, గోవిందు, మల్లయ్య, సుధాకర్, గోపీకృష్ణ, పోతప్ప నరసిం హులు, శ్రీరాములు, విశ్రాంతి ఉపాధ్యాయులు గంగరాజు, భగవద్గీత ప్రచారకర్త దివాకర్ పాల్గొన్నారు.

గుంతకల్ ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర-గుంతకల్లు: నియోజకవర్గ ప్రజల మీద శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు చేయడం అన్నారు. పట్టణంలోని కసాపురం రోడ్డులో శ్రీకృష్ణ వేణుగోపాల స్వామి దేవాలయంలో గుంతకల్ పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వెంకట శివుడు యాదవ్, గుంతకల్ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి హాజరైనారు. ముందుగా ఎమ్మెల్యే కు దేవాలయ కమిటీ శాలువాలతో పూలతో సత్కరించారు. అనంతరం శ్రీ కృష్ణాష్టమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నృత్య ప్రదర్శన చేసిన బృందానికి అభినందిస్తూ గుమ్మనూరు నారాయణ స్వామి రూ.10 వేల విరాళంగా అందించారు. గుంతకల్లు పట్టణ టిడిపి నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, మస్తానప్ప, లాయర్ కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని శ్రీ గంగమ్మ తల్లి ఆలయం వద్ద మండలంలోని కొట్టాల పల్లిలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను గ్రామ ప్రజలు భక్తులు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆలయాల్లో వెన్నదొంగ, చిలిపి కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వైసిపి మండల సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు వైసీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, బాల రమేష్ బాబు, ఎంపీటీసీలు బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, గొడ్డుమర్రి రామ్మోహన్, పాల్గొన్నారు.

అంగరంగ వైభోగంగా..

విశాలాంధ్ర-అనంతపురం : శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక అరవింద నగర్ లో ఉన్న శ్రీకృష్ణ అరవింద మందిరంలో మందిరం అధ్యక్షురాలు డా. మీరా దేవి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అభిషేకాలు, గోపూజ, ఊంజల సేవ, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులు గోపి, రాధా వేషధారణలు, నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మందిరం కార్యదర్శి బత్తలపల్లి సత్య రంగారావు, విజయలక్ష్మి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంసిద్ధ్ పాఠశాలలో

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : సంసిధ్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశాలపై అధ్యయనం, క్రమశిక్షణ, స్వాతంత్ర సమరయోధుల నాయకుల లక్ష్యాన్ని, వికాసాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ మధునిక మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు భావితరాల ప్రగతి, దిక్సూచి, మార్గదర్శకుడు అన్నారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణతో నృత్య ప్రదర్శన చేశారు.

అయోధ్య విద్యాలయ ఆధ్వర్యంలో

విశాలాంధ్ర-కణేకల్లు : కణేకల్‌లో శ్రీ చిక్కనేశ్వర దేవస్థాన కళ్యాణ మండపంలో అయోధ్య విద్యాలయ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారుల వేషధారణ చూసి వారి తల్లిదండ్రులు ఆనంద పడ్డారు. శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి మూడు సంవత్సరాలలోపు ఉన్న సునీల్ రెండవ బహుమతి నందా, నాలుగైదు సంవత్సరాల వయసుగల చిన్నారులకు మణిదీప్ అమృతకు ఆరు సంవత్సరాల వయసున్న షణ్ముఖ కుందనకు బహుమతులను అయోధ్య విద్యాలయం చైర్మన్ రామ్‌రెడ్డి కరెస్పాండెంట్ వారి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

సీపీఐ ఆధ్వర్యంలో జన సేవాదళ్ ట్రైనింగ్

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని ఎంజీఎం మైదానంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఈనెల 20 నుండి 25 వరకు ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ రెడ్ ఆర్మీ జన సేవాదళ్ కార్యక్రమాన్ని, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సిపిఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర జనసేవదాల్ కన్వీనర్ మురళి హాజరై సీపీఐ కార్యకర్తలకు శిక్షణిచ్చారు. ఈ శిక్షణ తీసుకున్న 50 మంది కార్యకర్తలు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈనెల 20 నుండి 25 వరకు జరుగు మహాసభలలో ఈ రెడ్ ఆర్మీ వాలంటీర్లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమల్ బాషా, సీపీఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, కార్యవర్గ సభ్యులు బాబు, చౌలూరు రవికుమార్, మారుతి రెడ్డి, చాంద్ బాషా, సమివుల్లా, చలపతి, జబివుల్లా, అన్సార్, ఇమ్రాన్, సురేష్, ఏఐఎస్ఎఫ్ ఆదర్శ్, అశోక్, అఫ్నాన్, యశ్వంత్, కిరణ్, వంశీ, అజయ్, ఏఐవైఎఫ్ నాయకులు జిలాన్, జియా, లింగప్ప, నాగేంద్ర, ఫైరోజ్, తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

కలెక్టర్ టి.ఎస్.చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టి.ఎస్. చేతన్ పేర్కొన్నారు.శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై ఆయన జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. ఆయన చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని యువత తమ జీవితాలలో ఆచరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సర్దార్ గౌతు లచ్చన్న 1909 ఆగస్టు 16న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచే సామాజిక చైతన్యం కలిగి స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, ఇతర ప్రధాన పోరాటాలలో పాల్గొన్నాడని, అతను బెర్హంపూర్, రాజమండ్రి జైళ్లలో కఠిన కారాగారవాసం అనుభవించాడని పేర్కొన్నారు.

అంతేకాక పలుమార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించా రని, గిరిజన, రైతు, కూలీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన యోధుడు అని తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19న కన్నుమూశారు. కానీ ఆయన చూపిన మార్గం, చేసిన త్యాగం, సాధించిన విజయాలు ఈ రోజు కూడా సమాజానికి దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడి సుదర్శన్, సమాచార శాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభ పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలో పాత హై స్కూల్‌లో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల సీపీఐ మండల కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ , ఈనెల ఆగస్టు 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరుగు రాష్ట్ర మహాసభలు ఉంటాయని.. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో, మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సోమందేపల్లి మండల సమితి పిలుపునిచ్చింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, సహాయ కార్యదర్శిలు ఎస్‌యాస్ భాష అంజనమ్మ, పార్టీ సభ్యులు, గంగరాజు, చంద్రశేఖర్, బాబాజాన్, మహిళా సంఘం నాయకులు నూర్జాన్, శిలా నారాయణస్వామి నారాయణస్వామి పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి జన్మాష్టమి వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కోట, బ్రాహ్మణ వీధిలో వెలిసిన శ్రీ వెన్న ముద్దల వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 16వ, 17వ తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి, రుక్మిణీ కళ్యాణమును అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అనంతరం కమిటీ వారు మాట్లాడుతూ శ్రీకృష్ణునికి అభిషేకములు, పూజలు, గోవింద పట్టాభిషేకం, ఉయ్యాల ఉత్సవం, తదితర కార్యక్రమాలు వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు నిర్వహించారు. ప్రసాద దాతలుగా తీర్థాల కృష్ణకుమారి, టెంపుల్ స్టోర్స్, ఉయ్యా లోత్సవ ఉభయ దాతలు వ్యవహరించారు. ఉయ్యా లోత్సవ ఉభయ దాతలుగా కాటం లక్ష్మీనారాయణ, కాటం రామకృష్ణ, కాటం వీరనారాయణ, కాటన్ పవనజ్ కుమార్ వ్యవహరించారని తెలిపారు. మొదటిరోజు ఉయ్యా లోత్సవ కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.17వ తేదీతో ఈ వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

విశాలాంధ్ర-చిలమత్తూరు: నియోజకవర్గంలో రెండు రోజులు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే బాలయ్య చిలమత్తూర్ మండల కన్వీనర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులతో సమావేశపరచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు, మండల్ వ్యాప్తంగా ఉన్న టిడిపి సీనియర్ నాయకులను కలుపుకొని వారి సూచనలు సలహాలు మేరకు ముందుకు వెళ్లాలని, వచ్చేనెల మొదటి వారంలో నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ పరిధిలో పర్యటించి నాయకులను కార్యకర్తలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పార్టీ బలోపేతానికి అడుగులు వేసేందుకు కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు శ్రీదేవి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు చెన్నమ్మ, విశ్వనాథ్ రెడ్డి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

చిరు ఉద్యోగికి సన్మానం

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం రోడ్లు, భవనాల శాఖలో గత 33 సంవత్సరాల నుండి గ్యాంగ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న రామాంజికి స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర అవార్డు వచ్చింది. ఈ విషయం తెలిసిన వెంటనే, ఉద్యోగ పోటీ పరీక్షల్లో సాధన చేసి ఉద్యోగాలు పొందిన వారు హిందూపురంకు విచ్చేసి రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆత్మీయతతో సన్మానించారు. దీంతో చిరుద్యోగి రామాంజి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నేను నా వంతుగా అప్పట్లో నిరుద్యోలకు.. పేదవర్గానికి చెందిన వాడిగా సహకారం అందివ్వగా నాకు ఇలా సన్మానం చేయడం మరచి పోలేని విషయం అన్నారు.

శ్రీకృష్ణునికి పూజలు చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కదిరి : పట్టణంలోని కోనేటి సమీపంలో గల శ్రీకృష్ణుని ఆలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా యాదవుల ఆహ్వానంమేరకు విచ్చేసి పూజలో పాల్గొని అనంతరం శ్రీకృష్ణుని రథాన్ని పురవీధుల్లో లాగారు. ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు మజీద్‌లోకి వెళ్లి డిసెంబర్ 27,28న కదిరిలో జరిగే ఇజితిమ ఏర్పాట్లపై వారితో చర్చించారు. తన వంతు సహాయ సహకారాలతో పాటు ప్రభుత్వం తరుపున సహాయం అందేలా చూస్తానని ముస్లిం పెద్దలకు భరోసా ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కదిరి టౌన్ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు కదిరి రైల్వే పోలీస్ స్టేషన్ యస్ఐ బాలకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి(50), చామన చాయ రంగు, బ్రౌన్ కలర్ బనీను, పాచి కలర్ డ్రాయరు ధరించి .143/15,కిలో మీటర్ వద్ద మదనపల్లి రోడ్ రైల్వే స్టేషన్ యార్డ్ వద్ద అనుమానాస్పదంగా చనిపోయి ఉన్నాడు. ఈ వ్యక్తిని గుర్తుపట్టిన ఎడల కదిరి రైల్వే పోలీస్‌స్టేషన్ 8919090782, 9133109537 సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయుల స్నేహపూర్వక క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర-కదిరి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఎస్‌టిఎస్ ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో తాలూకా పరిధిలోని పది మండలాల ఉపాధ్యాయులు స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి ఆటలో ఓడిసి జట్టుపై తనకల్ జట్టు విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జట్టు ప్లేయర్ నరేష్,రెండవ ఆటలో నంబులపూలకుంట 2 జట్టుపై తలుపుల జట్టు విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పవన్, శ్రీనివాసులు,మూడవ ఆటలో గోరంట్ల జట్టుపై ఎన్ పీ కుంట-1జట్టు విజయం సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆనంద్ నాయక్, గోపాల్ నిలిచారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహెర్ వలి,రామ్మోహన, ఆర్గనైజింగ్ కమిటీసభ్యులు కుంచెపు శ్రీనివాసులు, ఆజం, అశ్వర్థ, మనోహర్ శంకర్ నారాయణ రెడ్డి, రమణ, మను పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని జగరాజు పల్లి లో ప్రభాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సహకారంతో సంస్థ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మనిషికి కళ్ళు లేకపోతే జీవితమంతా అంధకారమే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం బిజీగా గడుపుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ గడుపుతున్న ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించడానికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. బెంగళూరుకు చెందిన మంజునాథ నేత్రాలయం వారి సహకారంతో ఈరోజు జగరాజుపల్లికి చెందిన ప్రభాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు అనిల్ కుమార్, సికిందర్‌తోపాటు మరికొంత మంది వైద్య బృందం సుమారు 127 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. సంస్థ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కంటి ఉచిత వైద్య శిబిరానికి 127 మంది హాజరయ్యారని, వీరిలో 37 మందిని చికిత్స నిమిత్తం బెంగళూరులోని మంజునాథ నేత్రాలయ ఆసుపత్రికి పంపిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మంజునాథ నేత్రాలయ వైద్యులు స్కాట్లాండ్, దక్షిణాఫ్రికాకు చెందిన అంగీలా డిక్సన్, లలిత అనూఫ్, రేఖ, జగరాజుపల్లికి చెందిన టీడీపీ నాయకులు మురళిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీరామ్‌రెడ్డి, పాల్గొన్నారు.

పిన్నదరిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యం
మంత్రి సత్యకుమార్ సతీమణి త్రివేణి

విశాలాంధ్ర, తాడిమర్రి : మండలం పరిధిలోని పిన్నదరి గ్రామంలో శనివారం రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి, కుమారుడు రిషి అద్వాని ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభించారు ఈ సందర్భంగా త్రివేణి మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన సురక్షితమైన తాగునీరు అందుతుందని తెలిపారు. అలాగే నీటి నాణ్యతపై ఆందోళనలో ఉన్న గ్రామస్తులు ప్రశాంతంగా ఆర్‌ఓ ప్లాంట్ నీటిని ఉపయోగించుకోవచ్చని వెల్లడించారు. సత్యకుమార్ ధర్మవరం నియోజకవర్గానికి రుణపడి ఉంటారని అన్ని విధాల అభివృద్ధి బాటలో నడుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తాడిమర్రి బీజేపీ మండల అధ్యక్షులు దేవర రామ్మోహన్, బీజేపీ సీనియర్ నాయకులు అంబర్ సతీష్, ధర్మవరం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్, అంబటి అరుణ శ్రీ, ధర్మవరం నియోజకవర్గ బీజేపీ మహిళా అధ్యక్షురాలు కంచం లీలావతి, టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ముంటి మడుగు హర్ష వర్ధన్, మాజీ సర్పంచ్ బసినేని విశ్వనాథ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, గోనుగుంట్ల నాగభూషణ్ సర్పంచ్ పాల్గొన్నారు.

మందు బాబులపై డ్రోన్‌తో ప్రత్యేక నిఘా

విశాలాంధ్ర-కదిరి : బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపినట్లు డీఎస్పీ శివన్నారాయణ స్వామి, పట్టణ సీఐ దివి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై డ్రోన్ నిఘా సహకారంతో వాటిని అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టౌన్ మహిళ పిఎస్ ఎస్ఐ సుమతి పోలీస్ సిబ్బందితో కలిసి బహిరంగ ప్రదేశాలను మద్యం సేవిస్తున్న 11మంది వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని యాదవ వీధిలో గల శ్రీ జయ కృష్ణ స్వామి దేవస్థానంలో శ్రీ కృష్ణాష్టమి మహోత్సవ వేడుకలు ఆలయ కమిటీ, పట్టణ మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం గోపూజ, అర్చన, గ్రామోత్సవం, ఉట్టి కొట్టు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. పిల్లల శ్రీకృష్ణుని, గోపికల వేషధారణ అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం చిన్నారులు వేసుకున్న వేషధారణకు ముద్దులైనారు. తదుపరి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని స్వయంగా తిలకించి వారి సంతోషాన్ని ప్రకటించారు. ఇటువంటి కార్యక్రమాలు హిందూ సాంస్కృతిక సంప్రదాయాలకు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా కరెస్పాండెంట్ చాంద్బాషా ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తదుపరి చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణ, తదుపరి ఉట్టి కొట్టుట లాంటి కార్యక్రమాలు చూపురాలను ఎంతగానో అలరించాయి. చిన్నారులకు బహుమతులను పంపిణీ చేశారు. పాఠశాల హెడ్మాస్టరు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా ఏడు శనివారాల వ్రతం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస నగర్ లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 40 మంది మహిళలచే ఏడు శనివారాల వ్రతం నిర్వహించినట్లు అర్చకులు రాజేష్ ఆచార్యులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ధర్మకర్తలు చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్, జింకా రాజేంద్రప్రసాద్, చెన్నం శెట్టి శ్రీనివాసులు చెన్నం శెట్టి రమేష్ లు వ్రతమునకు కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అర్చకులు వెంకటేశ్వర స్వామి వారిని వివిధ పూలమాలలతో పట్టు వస్త్రాలతో తులసి ఆకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. 40మంది మహిళలు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ముందు పెట్టి సాంప్రదాయ పద్ధతిలో వ్రతం చేసుకున్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కేశవ నగర్ లో గల కార్యసిద్ధి వీరాంజనేయ స్వామి ఆలయంలో దాణాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. తొలితా వీరాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, అర్చనలు, అభిషేకాలును అర్చకులు నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు ట్రస్టు తరఫున చీర అమ్మవారి పూజ నాణెం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ధనుంజయ్, జల్లా కార్తీక్ పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని రావులచెరువు జడ్పీ పాఠశాలకు విద్యార్థులకు రూ.1,75,000ల విలువచేసే సామగ్రిని బ్యాంకు అధికారులు బాల మురుగం శ్యామ్ సుందరం, నాగభూషణం, శ్రీనివాసులు పాఠశాల హెడ్మాస్టర్‌కు అందజేశారు. సామాగ్రిలో 18 బెంచీలు, క్లాస్ టేబుల్స్ 5, ఆఫీస్ టేబుల్ ఒకటి, చేర్లు 5, కంప్యూటర్ టేబుల్, ప్రింటర్, పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. హెడ్మాస్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు లక్ష్యంతో జీవితంలో ముందుకు వెళ్లాలని బ్యాంకు అధికారులు ఆకాంక్షించారు.

గోట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మకు పురస్కారం..

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని గుద్లూరు గ్రామ సర్పంచి పిట్టా నరసమ్మ కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర శకావత్ అధికారుల నుంచి స్వచ్ఛ పురస్కారమును అందుకున్నారు. మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దినందుకు కేంద్ర ప్రభుత్వం నరసమ్మను గుర్తించి పురస్కారాన్ని అందజేసింది. గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర వేడుకలకు ఆహ్వానంలో భాగంగా ఈ పురస్కారం అందించారు. ఎంపీడీవో సాయి మనోహర్, సచివాలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు సర్పంచ్‌ను అభినందించారు.

ఇసుక అక్రమ తరలింపుపై ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-బత్తలపల్లి: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో చిత్రావతి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై ఆర్డీవో మధుసూదన్, ఎమ్మార్వో స్వర్ణలత ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఉదయం అధికారులు రామాపురం సిసి రేవు గ్రామాలకు చేరుకొని అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే సేకరించాలని, అక్రమ ఇసుక తవ్వకాలు పర్యావరణానికి హానికరమైనదని, అలాగే రాష్ట్ర ఆదాయానికి నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. లారీల్లో ఇసుకను తరలించే సమయంలో ఇసుక మీద తార్పాలిన్ వాడాలని ఆదేశించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకు సంబంధిత అధికారులకు సూచించారు.

రామాలయంలో అఖండ రామ భజన

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామంలో ఉన్న కోదండ రామాలయం వద్ద శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అఖండ రామ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనకు తరలివచ్చే భక్తులకు అన్నదాన సౌకర్యం ఏర్పాటు చేశారు. చీమల చెరువు పల్లి, రెడ్డి వారి పల్లి, నంబులపూల కుంట, బలిజపల్లి, ఎద్దుల వారి కోట, ఎదురుదోన, యాదల వాండ్ల పల్లి,వట్టంవారి పల్లి తదితర గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరు

విశాలాంధ్ర-లేపాక్షి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని వైసిపి హిందూపురం నియోజకవర్గం సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. శనివారం మైదుగోళం సిరివరం గ్రామాలలో మండల కన్వీనర్ నిషార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గడపగడప తిరుగుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. మాటల మాంత్రికుడు చంద్రబాబు రాష్ట్రానికి చేసింది లేదని మండిపడ్డారు. వైసీపీ నాయకులు వైస్ ఎంపీపీ అంజన్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గంగాధర్ గోపాల్ పాల్గొన్నారు..

తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-కదిరి: మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులో నీటి సమస్యపై టీడీపీ ఇంచార్జ్ నాగే నరసింహులు స్పందించారు. పది రోజులుగా వికలాంగుల కాలనీలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు తెలపగా సొంత ఖర్చుతో ట్యాంకుల ద్వారా సరఫరా చేశారు. వికలాంగుల కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కృష్ణ పాల్గొన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్ పి.శివప్పకు సన్మానం

విశాలాంధ్ర - అగళి : అగళి సింగిల్ విండో సొసైటీ కార్యాలయానికి శ్రీ మెన్ కమిటీలో భాగంగా అగళి మండలంలో టిడిపి సీనియర్ నాయకుడు వీరాభిమాని పి. శివప్పకు డైరెక్టర్ పదవిని పార్టీ అధిష్టానం కట్టబెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం తన తోటి స్నేహితులు శాలువా కప్పి పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కడం, తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని మాజీ సర్పంచ్ శివలింగప్ప, ప్రిన్సిపాల్ గురునాథ్, విద్యుత్ లైన్మెన్ నరసింహమూర్తి,, కోడిపల్లి ఇంజనీర్ నరసింహమూర్తి హర్షం వ్యక్తం చేశారు .

మృతి చెందిన యువకుడికి నివాళులు

విశాలాంధ్ర-అమరాపురం: మండలంలోని ఆలదపల్లి గ్రామానికి చెందిన జయప్ప కుమారుడు రఘు(20) అనంతపురం పట్టణంలో డిగ్రీ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి అనంతపురం పట్టణంలో పనిమీద వెళ్లగా అక్కడ ఉన్న ఫలంగా ఓ కారు అతని ఢీకొనగా రఘు అక్కడికక్కడే కిందపడి మృతి చెందాడు. రఘు భౌతికకాయాన్ని తన స్వగ్రామమైన ఆలదపల్లి గ్రామానికి గ్రామానికి శనివారం తీసుకొని రాగా నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, అమరాపురం సర్పంచ్ వాగేష్ శివరం సర్పంచ్ చిత్తయ్య, ఆలదపల్లి సర్పంచ్ గిరిజమ్మ ఈరన్న, ఎంపీటీసీ కెంచప్ప, జయన్న నివాళులర్పించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలో జంబలబండ, దీన్నేహట్టి,తాళ్లకెర, తదితర గ్రామాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలందరూ భక్తి భావంతో పెంపొందించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి, మాజీ ఎంపిటిసి వెంకటేష్,బూదిపల్లి జయరామప్ప,బంగెప్ప,బల్లేకట్ట ఈరన్న, తదితర యాదవ సోదరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

విశాలాంధ్ర-హిందూపురం: తూముకుంట చెక్ పోస్ట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించడంలో సఫలీకృతులం అయ్యామని డీఎస్పీ కేవీ. మహేష్ వెల్లడించారు. డీఐజి, ఎస్పీ పర్యవేక్షణలో హిందూపురం డిఎస్పి కె.వి మహేష్ సబ్ డివిజన్ లోని సీఐలు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు గత 20 రోజులుగా కేసు విచారణలో భాగంగా పలు రాష్ట్రాలు పర్యటించి, పలు పాత నేరస్తులను విచారించి, సాంకేతిక ఆధారాలు బట్టి హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్ పన్వాం అతని సహచరులు నేరం చేసినారన్న విషయాన్ని నిర్ధారించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు అనిల్ కుమార్ పన్వార్‌ను హర్యానా రాష్ట్రంలో అరెస్టు చేసి కోర్టులో శనివారం హాజరుపరిచామని. చోరీ కాబడిన సొత్తు వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది అదే గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ గత రెండు రోజులుగా కనిపించకపోవడంతో భర్త పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం గ్రామంలోని చెరువులో సుజాత మృతదేహం లభ్యం కాగా మృతురాలు సుజాతగా గుర్తించారు, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 17, ఆగస్టు 2025

యదేచ్ఛగా అక్రమ కలప దందా

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల వ్యాప్తంగా 12 పంచాయితీలలో చింత వేప కానుగ తదితర వృక్షాలు పంట పొలాలలో గుట్టలలో వనములలో గ్రామాలలో ఏపుగా పెరిగిన చెట్లను నేల కూలుస్తు న్నారు. యదేచ్ఛగా అక్రమ కలప దందా అక్రమార్కులు చేసుకుంటూ వ్యాపారమే ధ్యేయంగా పెట్టుకొని పచ్చని చెట్లు నరికి దందా సాగిస్తున్నారు. ఈతంగంపై అటవీ శాఖ అధికారులకు తెలిసిన ను చూసి చూడనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. రైతులకు బురిడీ మాటలు చెప్పి అతి తక్కువ ధరలకే వృక్షాలను కొనుగోలు చేసి వాటిని నేలకూల్చి వారికి అనువైన సమయాన్ని చూసుకొని వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ క్వింటాళ్ళ చొప్పున అమ్ముకుంటున్నారు. ఈ చెట్లు నరికివేత పై అధికారుల నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమార్కులు రెచ్చిపోయి చెట్లను నేల కూల్చి అధిక ధరలకు విక్రయిస్తూ అందిన కాటికి దండుకుంటున్నారు. దీంతో ప్రకృతి నాశనమైపోయి సకాలంలో వర్షాలు పడక అతివృష్టి అనావృష్టికి దాపురిస్తుందని మేధావులు చర్చించుకుంటున్నారు. అధికారుల అలసత్వంతో దళారులకు వరంగా మారిందని కలప దొరికిన కాటికి పరిశ్రమలకు, కర్ణాటక రాష్ట్రానికి తెగ నమ్ముకుంటూ అక్రమార్కులు యదేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే సమాచారం. అక్రమార్కులు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి పర్యాటకులను అలరించే సైబీరియన్ పక్షులు సంచరించే ప్రదేశాలలో సైతం చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదని విశ్వసనీయ సమాచారం, అక్రమ కలప రవాణా అటవీ శాఖ అధికారుల కను సన్నలలో జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి, అధికారులు కలప వ్యాపారస్తులతో చేతులు కలపడంతో వారి సంపాదన మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుందని ప్రచారం వినబడుతుంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు అనుమానం రాకుండా అప్పుడప్పుడు తుతూ మంత్రముగా దాడులు నిర్వహించి కేసులు కట్టి అపరాధ రుసుము కట్టించుకొని మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే వృక్షజాతి అంతమై పర్యావరణంలో మార్పులు వచ్చి ప్రకృతి విలయం సంభవిస్తుందని మేధావులు చర్చించుకుంటున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు చేస్తారో లేదో మరి వేచి చూడాల్సిందే.

ఉద్యోగుల సమస్యలు ఉంటే యూనియన్ దృష్టికి తీసుకురావాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమస్యలు తలెత్తితే యూనియన్ దృష్టికి తీసుకురావాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, పాలెల రామాంజనేయులు యాదవ్‌లు పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కు 2019 ఆగస్టు 16వ తేదీన గుర్తింపు వచ్చిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ ఆదేశాలతో పుట్టపర్తి జిల్లా కార్యాలయం లో జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నేటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు వచ్చి ఆరు సంవత్సరాల పూర్తయ్యిందని ఈ ఆరు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున అనేక ఉద్యమాలు చేసి విజయం సాధించడం జరిగిందన్నారు.నాలుగో తరగతి ఉద్యోగి నుండి గ్రూప్ వన్ అధికారుల వరకు అన్ని కేడర్ల ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం లో కొనసాగుతున్నారన్నారు .ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తిన యూనియన్ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తున్నామని జిల్లా అధ్యక్షులు హామీ ఇచ్చారు.యూనియన్ గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకొని "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" కార్యక్రమాన్ని విజయవంతం చేయడం యొక్క అవశ్యకతను కార్యదర్శి రామాంజనేయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోవిందప్ప, రవి , ముసలి రెడ్డి,సహా కార్యదర్శి కిషోర్, వివిధ తాలూకాల అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

17న శ్రీ సత్య సాయి యూనిటీ కప్ ఫైనల్స్

విశాలాంధ్ర-పుట్టపర్తి: భారతదేశంలో ఉన్న శ్రీ సత్యసాయి సేవా సంస్థల మధ్య ఏడాది పొడవునా జరిగిన క్రికెట్ మ్యాచ్ ఆఖరి అంకానికి చేరుకున్నది. హర్యానా, అస్సాం, వెస్ట్ బెంగాల్, తెలంగాణ, చతిస్గడ్ ,గోవా రాష్ట్రాల నుంచి ఆయా జుట్టులు ప్రీ క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకున్నాయి. ఆగస్టు 17న జరిగే ఫైనల్ మ్యాచ్ శ్రీ సత్య సాయి హిల్ వ్యూ స్టేడియం లో,క్రికెట్ అభిమానులు మధ్య జరుగుతుంది. ఈ కార్యక్రమానికి విశేష అతిథులుగా భారత మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, అమూల్ మజుంధార్, మురలీ కార్తీక్, ఎం ఎస్ కె ప్రసాద్,శ్రీలంక మాజీ క్రికెట్ కెప్టెన్ అర్జున రణ తుంగ, వెస్ట్ ఇండీస్ మాజీ క్రికెటర్ కలిచరణ్ కూడా హాజరుకానున్నారు.

రక్త దానం చేయడానికి ముందుకు రావాలి

విశాలాంధ్ర-ధర్మవరం: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్, యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్,ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రూడ్ సెట్ సంస్థ నందు మెగా రక్త దాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, జయ మారుతి, అడ్వకేట్ రాజశేఖర్ గౌడ్, కాటమయ్య, శిక్షకులు ఉషారాణి, నాగేంద్ర రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాగంగా అతిథులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒక సారు రక్త దానం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ప్రశంస పత్రాలను అందించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది ,రూడ్ సెట్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ రాతి దేవస్థానంలో భక్తులుతో కిటకిట

విశాలాంధ్ర-గుంతకల్లు: శ్రీ లక్ష్మీనారాయణ స్వామిరాతి దేవస్థానంలో శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా, కృష్ణాష్టమి సందర్భంగా గోదాదేవి అమ్మవారికి శ్రీకృష్ణుని వారికివిశేష అభిషేకాలు పూజలు దేవస్థానంలో నిర్వహించారు. వందలాదిమంది భక్తులు శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ తలారి శకుంతలమ్మ ఆలయ ధర్మకర్త తలారి తేజ మాట్లాడుతూ శ్రావణ శనివారం సందర్భంగా అన్నదాన ఆశ్రమం నందు పెద్ద సంఖ్యలో భక్తాదులు రావడం జరిగిందినీ ఆలయమంతా భక్తాదులతో కిటకిటలాడిందన్నారు. నిత్య అన్న ప్రసాద వితరణ అందించడం జరుగుతుందన్నారు. లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ ఆంజనేయ స్వామి భజన బృందం వారు అప్పాజీపేట, పామిడి మండలం అనంతపురంజిల్లా అధ్యక్షులు రామలింగప్ప ,రాము శివ భక్తి భజన బృందం వారు పుచ్చకాయ మాడ గ్రామం వారు పత్తికొండ మండలం కర్నూలు జిల్లా వారు అధ్యక్షులు చంద్ర రాజు వీరి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేయడం జరిగిందని అన్నారు. ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ నిత్యాన్నదాన సేవకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ గోపికల వేషధారణ

విశాలాంధ్ర-ఉరవకొండ: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఉరవకొండలో శనివారం చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో విశేషంగా ఆకట్టుకున్నారు. శ్రీ కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. చిన్నారుల వేషధారణ చూసి వారి తల్లిదండ్రులు ఆనంద పరవశులయ్యారు.

సీఐ మనోహర్‌కు సన్మానం

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణ 1 టౌన్ పోలీసుస్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిఐ మనోహర్‌ని శనివారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు. పూలతో శాలువా తో సన్మానం చేసే సత్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ నాయకులు వై. భీమలింగ మాట్లాడుతూ అనంతపురం పట్టణం లో పోలీస్ పేరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది అందులో భాగంగానే ఉత్తమ సేవలు అందించిన గుంతకల్లు 1 టౌన్ సి. ఐ. మనోహర్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ మరియు జిల్లా %ఊ్రా% జగదీష్ చేతులు మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నందుకుఎమ్మార్పీఎస్ కమిటీ తరుపున సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అలాగే మున్ముందు మరెన్నో సేవలు చేసి భవిషత్తు లో మరెన్నో అవార్డు లు అందుకోవాలనీ అన్నారు.ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎర్రిస్వామి, పట్టణ కన్వీనర్ బి. సంపత్, ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్, మస్తాన్, రామాంజి, నల్లారెడ్డి, నెట్టికల్లు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

లక్ష్మీ రంగనాథునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని చిగతుర్పి గ్రామంలో కొలువదీరిన శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి వారికి శ్రావణ శనివారం కావడంతో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి అభిషేకం పాలుభిషేకం కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకల పూల అలంకరణలతో స్వామివారి ముక్కుబడి తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో తీర్థ ప్రసాదం అందించారు.

కరుట్లపల్లిలో విరబూసిన బ్రహ్మ కమలం..

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగి అయిన ఎస్ ధనుంజయ,జ్యోత్స్నవారి ఇంట్లో శనివారం బ్రహ్మకమలం విరబూసింది. ఈ విషయం తెలుసుకున్న,అతని కుటుంబ సభ్యులు,బంధువులు, గ్రామస్తులు బ్రహ్మకమలాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఏడాదికి ఒకసారి మాత్రమే పూలు వికసించి కొన్ని గంటల వ్యవధిలోనేముడుచుకుంటాయని, శనివారం కృష్ణాష్టమి కావడంతో మా ఇంటి నందు బ్రహ్మ కమలం వికసించడం ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ధనుంజయ తెలిపారు. పూలను శివాలయంలో అందజేసి స్వామివారికి సమర్పిస్తామని వారు తెలిపారు.

అశ్వత చిన్ననాగులుకు విశేష పూజలు

విశాలాంధ్ర-కణేకల్లు: శ్రావణమాసం సందర్భంగా కనేకల్ గ్రామంలోని ఉరుకొండ రోడ్డులో వెలసిన శ్రీ చిన్ననాగుల కట్ట వద్ద శనివారం రోజున ప్రతి శ్రావణ సంవత్సరం లాగానే ఉరుకొండ రోడ్డు యూత్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా అందరూ కలిసి శ్రీ చిన్ననాగుల గట్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకము పూజా కార్యక్రమాలు అభిషేకాలు పూజలు ఘనంగా కొన్ని వందల మందికి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

భక్తి ప్రపత్తులతో కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కృష్ణాష్టమి వేడుకలు కళ్యాణ దుర్గం నియోజకవర్గం లో భక్తి శ్రద్ధ లతో జరుపుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడి వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కులదైవమైన కృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ విద్యా మందిర్ లో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒంటిమిద్ది గ్రామంలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించి భక్తులకు అన్నదానం చేశారు. మరి మాకులపల్లి, కురాకులతోట, సెట్టూరు తదితర గ్రామాల్లో యాదవ కులస్తులు ప్రత్యేక ఏర్పాటు చేసుకొని కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్డిటి ఆసుపత్రి ఎదురుగా వెంకటేశ్వర దేవాలయంలో కృష్ణుని విగ్రహానికి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలం లోని లింగ దహాళ్ గ్రామాల్లో యాదవ సంఘం నాయకులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూలమాలలు వేసి వేద పండితుల మధ్య ఘనంగా పూజలు నిర్వహించారు అనంతరం గోపూజ మహా మంగళహారతి పంచామృత పాలాభిషేకం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఆదివారం సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యాదవసోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పట్టణంలో కోట లోపల గల శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని ఉత్సవ విగ్రహ ఊరేగింపు రథాన్ని ప్రారంభించిన కూటమి నాయకులు కార్యకర్తలు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో విలసిల్లాలని కోరుకొన్నారు. ప్రజలందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, బాబుల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఘణంగా శ్రావనమాస మాసాలు

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలోని పెద్ద కోట్లపల్లి, నల్లమాడ, బాసంవారిపల్లి,ఎద్దులవాండ్లపల్లితండా,శీకివారిపల్లి,మూలప్పగారిపల్లి,గోపేపల్లి, బొగ్గల పల్లి ,పోలంవాండ్లపల్లి,తదితర గ్రామాలలో శనివారం ఆయా ఆంజినేయ స్వామి దేవాలయాల్లో ఘణంగా భక్తి శ్రద్ధలతో 4వ శనివారం శ్రావన మాస పూజలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మిప్రసాద్,మంజునాథలు మాట్లాడుతూ స్వామివారికి భక్తులు ఆకపూజలు కాయకర్పూరాలు, పూలమాలలు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం కార్యక్రం ఏర్పాటు చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి రోడ్‌లో ఉన్న బాలికల హాస్టల్ వద్ద ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు వారం రోజులపాటు ఇక్కడ నిర్వహిస్తారు. పాత తాసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రజలు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఇక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు చిన్నారులు శ్రీకృష్ణుని రుక్మిణ వేషధారణ వేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి.

ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మున్సిపాలిటీ లోని 1వ వార్డు ఇస్లాపురం గ్రామంలో ఘనంగా శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుపుకున్నారు, ఉత్సవ విగ్రహం ఊరేగింపు మరియు కొలాట, చెక్కభజన సాంస్కృతిక కార్య క్రమాలు అందరినీ అలరించాయి. టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, కౌన్సిలర్ హనుమంతు,దుద్దేబండ శ్రీరాములు, శ్రీహరి, హనుమన్న, పోతప్ప, మూర్తి ,భజన బృందం,ఇస్లాపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా వేప విత్తనాల అక్రమ వ్యాపారం చేస్తూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాళ్లపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి ఐదు సంవత్సరాలుగా కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తుల ద్వారా వేప విత్తనాలను సేకరించి తన వ్యవసాయ పొలంలో విత్తన పరుశుద్ధి యంత్రం ద్వారా కూలీలను పెట్టి వేప విత్తనాలను శుభ్రం చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంత పెద్ద వ్యాపారం చేయాలంటే ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి అలాగే ప్రభుత్వాలకు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ వ్యాపారి అక్రమంగా ఒక సంవత్సరాలలో ఐదు నెలల కాలంలోనే 30 నుండి 60 లక్షలు దాకా వ్యాపారం చేస్తూ అక్రమ సంపాదన చేసుకుంటూ ప్రభుత్వానికి గండి కొడుతున్నట్లు అలాగే ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు వెళ్లే దారిలోనే వేప విత్తనాలు శుద్ధి చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్వహిస్తున్న వేప విత్తనాల వ్యాపారి ఆగడాలకు చమర గీతం పాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హనుమాన్ నామ స్వరంతో హెూరెత్తిన కసాపురం

విశాలాంధ్ర-గుంతకల్లు: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా నాలుగవ శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో జై హనుమాన్ నామ స్వరంతో దేవాలయం కళకళలాడింది. కసాపురం పుణ్యక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలలో ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామి వారి మూల విరాట్ కు అర్చనా, అభిషేకాలు నిర్వహించి బెంగళూరు నుండి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని మనోహరంగా అలంకరించి భక్తాదులకు దర్శనం కావించారు. సాయంకాలం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి సహిత ఉత్సవ మూర్తులను యాగ మండపంలో కొలువుదిర్చి అర్చన, అభిషేక, హెూమాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరంఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదిర్చి కసాపురం మాడవీధులలో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ రాజు, ఏ ఈ ఓ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు గరుడ స్వామి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర-తనకల్లు: నల్లచెరువు మండలం పాలపాటి దీన్నే ఆంజనేయ స్వామి సన్నిధిలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు గాలివీటి వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ లు శ్రావణమాసం నాలుగవ శనివారాన్ని పురస్కరించుకొని ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ చేయడం చాలా సంతోషించదగ్గ విషయమని, ఇలాంటి కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆ దేవదేవుని కృపేనన్నారు. అన్నదానం ఏర్పాటు చేసిన వారు, వారి కుటుంబీకులు స్వామి ఆశీస్సులతో చల్లగా ఉండాలని ఆలయ కమిటీతోపాటు భక్తాదులు కోరుకున్నారు.

బత్తలపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-బత్తలపల్లి:శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో వివిధ పాఠశాలలు, ఆలయాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులను కృష్ణునిగా, గోపికలుగా అలంకరించి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. చిన్నారుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కృష్ణుడు వేణువు ఊదుతూ, గోపికలు ఆయనతో నృత్యం చేస్తున్నట్లుగా చిన్నారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలు ప్రజలను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. కృష్ణాష్టమి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-పెనుకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు,రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు ఈడిగ (గౌడ) సంఘం, తెలుగుదేశం నాయకులు అన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే, బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈడీగ సంఘం నాయకులు మాజీ జెడ్పీటీసీ చిన్నప్పయ్య, మరియు మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి,యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య,జిల్లా బిసి కమిటీ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, హిందూపురం ఈడిగ సంఘం నాయకులు రామకృష్ణప్ప తదితరులు హాజరైయ్యారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీ యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘ నాయకులు గిరి, శేఖర్, దేవేంద్రప్ప, వినయ్, లాయర్ నవీన్, గోపి, మారుతి, టీచర్ నారాయణస్వామి, పద్మ, హరి, హనుమంతు, హరీష్ గౌడ్, అశ్వర్థ, నరేంద్ర, బాబు మరియు తెలుగుదేశం పార్టీ పట్టణ, మండల కన్వీనర్ శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్ లు, బిజెపి రామకృష్ణ ఎన్డీఏ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన నేమకల్లు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్ గ్రామంలో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయానికి శ్రావణమాసం నాలుగవ శనివారం భక్తులు పోటెత్తారు ఆలయ ప్రధానార్చకులు అనిల్ కుమార్ చార్యులు సంతోష్ కుమార్ చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ పంచామృతాభిషేకం తులసిలంకరణ, ఆకు పూజ నిర్వహించారు. ఆంధ్ర కర్ణాటక తెలంగాణ నుండి వేలాది మంది భక్తులు హాజరై మొక్కలు తీర్చుకున్నారు భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఆదివారం తెల్లవారుజామున ఆంజనేయస్వామి ఉత్సవం సాయంత్రం 6 గంటలకు స్వామివారి బ్రహ్మోత్సవం ఉంటుందని ఆలయ కార్యనిర్వాణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఓబన్న, జితేంద్ర, మాజీ ఆలయ ధర్మకర్తలు కాశీనాథ్ శెట్టి, వన్నూరు స్వామి, శాంతయ్య, అన్నదాన కమిటీ చైర్మన్ తిప్పేస్వామి, గాలి బసప్ప, మాజీ సర్పంచ్ హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివ కేశవ రూపంలో బుగ్గ రామలింగేశ్వరుడు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణం పక్కలో ఉన్న దక్షిణ కాశీగా పిలవబడే పెన్నానది ఒడ్డున వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా బుగ్గ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా బుగ్గ రామలింగేశ్వర స్వామికి పురోహితులు రవి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పుష్పలం కరణ, శివ కేశవ రూపంలో అలంకరణ, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మరవ కొమ్మన ఘనంగా అన్నప్రాసన

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల మరవ కొమ్మన శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా కమిటీ నిర్వాహకులు రామ్ చరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల క్రాస్‌లో ప్రతి శనివారం ఋష్య శృంగ మహాముని శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శనివారం అన్నదానానికి నిత్యవసర సరుకులు శింగనమల బోయ నాగలాపురం విజయ్,డీలర్ మసూద్ వలి, శివపురం రవి, ఏ కుల ఆది, అందజేసినట్లు తెలిపారు. ప్రతివారం జరిగే ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలుముందుకొస్తున్నారన్నారు. ఆటో రుషింగప్ప, నల్లప్ప, అగ్రహారంగంగరాజు,కేశవ ,రాముడు, ఆదినారాయణ, తిరుపాలు, ప్రసాదు,శేష,రాము,శ్రీరాములు శివపురం,శింగనమల గ్రామస్తులు భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలోని రామాలయం దగ్గర శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు, భక్తిశ్రద్ధలతో రాధా కృష్ణలకు పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను రాధాకృష్ణ వేష ధారణలు చూపరులను ఆకర్షించాయి. సాయంత్రం రాధాకృష్ణలను నగర పురవీధుల్లో ఘనంగా మేళతాళాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రాధాకృష్ణల భక్తమండలి, భక్తాదులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం పెన్నా హెూబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవ దీర్చి ఆలయము చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రమేష్ బాబు అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

విశాలాంధ్ర-పెనుకొండ: మండలం పరిధిలోని వెంకటరెడ్డి పల్లి ప్రాతమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ స్వామి, ఆధ్వర్యంలో పాఠశాలకు కావలసీన 6కుర్చీలు సమాకూర్చిన బి.అంజనప్ప, మంజుల, శ్రీనివాసులు, టిడిపి నాయకులు క్రిస్ట అందచేశారు. వీరికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ స్వామి, గిరిజమ్మ, భారతి, కరుణ, ఆనందమ్మ, నరేష్ కుమార్, చంద్ర శేఖర్, బాబు పాల్గొన్నారు.